సాక్షి ఒడిశా

శుక్రవారం, 25 ఏప్రిల్, 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,97,145లు, బంగారం 2గ్రాముల 600 మిల్లీగ్రాములు, వెండి 15 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నలుగురు దొంగల అరెస్టు

జయపురంలో నలుగురు దొంగలను అరెస్టు చేశారు. చోరీ సొత్తు రికవరీ చేశారు.

- 8లో



కుందేళ్ల కళేబరాలు

ప్రేమ్ పహాడ్ వద్ద కుందేళ్ల మృతదేహాలు కనిపించాయి. స్థానికులు నిశ్చేష్టులయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

లిఫ్టులో చిక్కుకుని రోగి మృతి



లిఫ్టులో చిక్కుకుని మృతి చెందిన రోగి

భువనేశ్వర్: చికిత్స కోసం తరలిస్తున్న రోగి లిఫ్టులో చిక్కుకుని అకాల మరణానికి గురయ్యారు. ఈ విచారకర సంఘటన భద్రక్ జిల్లా ప్రధాన ఆరోగ్య కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మృతురాలు భద్రక్ జిల్లా రాండియా పంచాయతీ నర్సింగ పూర్‌కు చెందిన మీనతి పరిదాగా గుర్తించారు. మీనతి పరిదాకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికరం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను భద్రక్ జిల్లా ప్రధాన వైద్య ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత ఆమెను మహిళా వైద్య వార్డుకు తీసుకెళ్లమని డాక్టర్ సలహా ఇచ్చారు. వైద్యుని సలహా మేరకు కుటుంబ సభ్యులు ఆమెను లిఫ్ట్‌లోని మహిళా వైద్య వార్డుకు తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో విషాదం చోటు చేసుకుంది. రోగిని లిఫ్ట్‌లో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అకస్మాత్తుగా పైకి కదిలింది. దీంతో రోగి నుజ్జునుజ్జు అయి చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ ఘటనతో ఆస్పత్రి ఆవరణలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని బాధిత వర్గాన్ని బుజ్జగించి పరిస్థితిని చక్కదిద్దారు.

ఉగ్రమూకలను అణిచివేయాలి



బైకు ర్యాలీలో పాల్గొన్న హిందు ఐక్యత సంస్థలు

రాయగడ: జమ్మూ–కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై దాడులకు తెగబడిన ఉగ్రమూకలను అణిచివేయాలని స్థానిక హిందూ ఐక్యతా సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ మేరకు స్థానిక జగన్నాథ మందిరం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు పట్టణంలో ర్యాలీలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



సుభద్ర యోజన చెక్కులు అందజేస్తున్న దృశ్యం

రాయగడ: గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఫరూల్ పట్వారి తెలియజేశారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో గురువారం జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీలను అభివృద్ధి చేస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు పంచాయతీల్లోని వివిధ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, జిల్లా అదనపు ఎస్పీ విష్ణు ప్రసాద్ పాత్రో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుభద్ర యోజనలో భాగంగా లబ్ధిదారులు ఆర్థిక సహకారం అందజేశారు.

హత్య కేసులో 28 మంది అరెస్టు



హత్యకేసులో అరెస్టైన నిందితులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసుస్టేషన్ పరిధి హటొపాడొరొ వీధిలో నివసిస్తున్న భైరవ సాహు అనే వ్యక్తి చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో వీధిలోని కొందరు దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు 28 మందిని గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో ఏడుగురు మైనర్లు కావడంతో వారిని జిల్లా కేంద్రంలోని ఫోక్స్ కోర్టుకు తరలించారు. అదేవిధంగా సంఘటన జరుగుతున్న సమయంలో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులపై దాడి చేసిన విషయమై మరో కేసును పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి అరెస్టయిన వారిలో కొంతమంది ఉండగా, మరి కొందరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.50 వేల నగదు పురస్కారం

త్వరలో ప్రతి గ్రామానికి .. తాగునీరు



రాష్ట్ర స్థాయి జాతీయ పంచాయతీ దివస్ సభలో ముఖ్యమంత్రి ప్రసంగం

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: 2026 నాటికి అన్ని గ్రామాలకు తాగునీటిని అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హామీ ఇచ్చారు. పూరీలో గురువారం జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ రాష్ట్ర స్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది ప్రజలు ఇప్పటికీ తాగునీరు, విద్యుత్ సరఫరా, పక్కా ఇల్లు, రహదారులు వంటి ప్రాథమిక సౌకర్యాలకు దూరంగా ఉన్నారని అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం వికసిత్ గాంవ్, వికసిత్ ఒడిశా (అభివృద్ధి చెందిన ఒడిశా కోసం అభివృద్ధి చెందిన గ్రామం) కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్మించడానికి పంచాయతీ రాజ్, తాగునీటి శాఖ ప్రత్యేక కార్యక్రమానికి రూ. 10,000 కోట్లు కేటాయించిందని తెలిపారు. 2026 నాటికి ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్లు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందరికీ పక్కా ఇళ్లు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అభయం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అంత్యోదయ గృహ జోజన (ఏజీజే) కింద నిరాశ్రయులు, దివ్యాంగులు, ప్రకృతి వైపరీత్య బాధితులు వంటి పేదలు, నిరుపేదలకు 5 లక్షల ఇళ్లను అందించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరం అంత్యోదయ గృహ యోజన కోసం బడ్జెటులో రూ. 2,600 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. రానున్న మూడేళ్లలో ఈ పథకం కింద మొత్తం రూ.7,550 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 314 మండలాల్లో రూ. 4,124 కోట్ల వ్యయ ప్రణాళికతో స్టేడియంల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సుభద్ర యోజన కింద 2 లక్షలకు పైగా మహిళా లబ్ధిదారులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా ఆయన రూ. 200 కోట్ల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ మహిళలు 2 విడతల కింద సమగ్రంగా రూ.10,000 ఆర్థిక సాయం పొందారు. మహిళల ఆకర్షిత సుభద్ర యోజన పథకం కింద 2.09 కోట్లకు పైగా మహిళలు లబ్ధి పొందారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, తాగునీటి శాఖకు చెందిన 3 పోర్టల్‌లు ముఖ్యమంత్రి ప్రారంభించారు. వీటిలో పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, పంచాయతీ మానిటరింగ్ సిస్టమ్ మరియు ఈ–పంచాయత్ సభ పోర్టల్‌లు ఉన్నాయి. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన లబ్ధిదారులకు సబ్సిడీలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.78,000 సబ్సిడీని ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ. 60,000 సబ్సిడీని అందజేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో 613 పంచాయతీలకు ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘం గ్రాంట్లు కింద రూ. 32 కోట్లు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో 20 కొత్త ఎన్‌ఏసీల ఏర్పాటు ప్రక్రియ

భువనేశ్వర్:

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 20 నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్స్ (ఎన్ఏసీ) ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. పట్టణాభివృద్ధిని పెంపొందించే దిశగా ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయించింది. ఈ చర్యతో రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల విస్తరణ పుంజుకుంటుంది. ప్రయత్నం మేరకు కార్యాచరణ సఫలమైతే పట్టణ ప్రాంతాలు ప్రస్తుత 17 శాతం నుంచి 30 శాతానికి పెరుగుతాయి. కొత్త ఎన్ఏసీల ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ వివిధ జిల్లాల నుంచి అవసరమైన నివేదికలను సేకరించడం ద్వారా ఈ కొత్త ఎన్ఏసీల రూపొందించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ నివేదికలను సమగ్ర మూల్యాంకనం కోసం పంచాయతీరాజ్ శాఖకు సిఫారసు చేసింది. ఈ మూల్యాంకనం తర్వాత ముఖ్యమంత్రి ఆమోదం పొందడంతో కొత్త ఎన్ఏసీల ఏర్పాటు పూర్తవుతుంది. ఈ సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో మాట్లాడుతూ ఇప్పటివరకు 20 ఎన్ఏసీల ఏర్పాటుకు నివేదికలు అందినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాలను బలోపేతం చేయడానికి వేగవంతమైన ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. గతంలో జిల్లా కలెక్టర్లు ప్రతిపాదిత ఎన్ఏసీల ఏర్పాటు కోసం నిర్దిష్ట విధానపరమైన దరఖాస్తుల దాఖలు ప్రక్రియతో విస్తరణ నివేదికలను సమర్పణ పూర్తయ్యింది. రాష్ట్రం అంతటా పట్టణీకరణ వేగవంతం చేసి పట్టణ ప్రాంతాల పరిధిని విస్తరించే దిశలో విభాగం కృషి చేస్తుంది. పట్టణ ప్రాంతాల క్రమబద్ధమైన, వ్యవస్థీకృత విస్తరణకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. కొత్త ఎన్ఏసీలను ఏర్పాటు చేయాలనే ప్రజల డిమాండ్‌ను పట్టణ అభివృద్ధి శాఖ సమీక్షించింది. జిల్లా కలెక్టర్ల నుంచి సాధ్యాసాధ్యాల నివేదికలను కోరింది. ఈ నేపథ్యంలో దాదాపు 20 ఎన్ఏసీల ఏర్పాటు సాధ్యాసాధ్యాల నివేదికలు విభాగానికి అందాయి. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ వీటిని సమగ్రంగా విశ్లేషిస్తుంది. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాలను 30 శాతానికి పెంచాలనే యోచనతో అనుబంధ విభాగాలు విశేషంగా కృషి చేస్తున్నాయని విభాగం మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి జిల్లాలోని చందిలి పోలీసులు బుధవారం సాయంత్రం ఒక నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.38,700ల నగదు, ఒక స్కూటీతో సహా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అతడి వివరాలను పోలీసులు వెల్లడించారు.

ముమ్మరంగా ఎక్సైజ్ దాడులు



స్వాధీనం చేసుకున్న విప్పపువ్వు బస్తాలు

రాయగడ: ఒడిశా – ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం ముమ్మరంగా దాడులు చేపట్టారు. సరిహద్దు ప్రాంతాలైన శశిఖాల్, తంబలబాయి, సందుబడి, సనొ సందుబడి, పాణి ఛత్తర్, జొరుడి తదితర గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో భాగంగా తంబలబాయి గ్రామంలో 3,500 లీటర్ల ఊట, 300 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పాణిఛత్తర్ గ్రామంలో 1,200 లీటర్ల ఊట, 80 లీటర్ల నాటుసార, జొరుడి గ్రామంలో 800 లీటర్ల ఊట, 40 లీటర్ల నాటుసారా, సందుబడి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 7 వేల లీటర్ల ఊట, 400 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అదేవిధంగా నాటుసార తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.




స్వాధీనం చేసుకున్న సామగ్రి

విప్పపూవు స్వాధీనం

నాటుసారా తయారీకి వినియోగించే 3 వేల కిలోల విప్పపువ్వును అధికారులు స్వాధీనం చేసుకుని, దీనికి సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో జయానంద్ బచేలి, సబలొజాన్ బచేలిలు ఉన్నారు. సందుబడి గ్రామంలో అక్రమంగా వ్యాన్‌లో విప్పపువ్వు తరలిస్తుండగా పట్టుబడ్డారు.

సైకత సంతాపం



జమ్ము కశ్మీరు పహల్గామ్ ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు అంతర్జాతీయ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పం ఆవిష్కరణతో సంతాపం ప్రకటించారు. పూరీ సాగర తీరంలో 'అమాయకుల ప్రతీకార హత్య' అనే సందేశంతో సుదర్శన్ పట్నాయక్ ఆకర్షణీయమైన సైకత శిల్పం తీర్చిదిద్దారు.

– భువనేశ్వర్

స్కార్పియో బోల్తా



అంగుల్ నుంచి పూరీకి వెళ్తుండగా స్కార్పియో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం బారంగ్ దిగొఛియా కాలువ సమీపంలో చోటు చేసుకుంది. అదృష్టవశాత్తు ఈ వాహనంలోని ప్రయాణికులంతా సురక్షితంగా బతికి బట్టకట్టారు.

– భువనేశ్వర్

పార్లమెంట్ ఆకారంలో పంచాయతీ కార్యాలయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మత్తిలి బీడీఓ ప్రమోద్ కుమార్ బెహరా



పార్లమెంట్ భవనం ఆకారంలో నూతన పంచాయతీ కార్యాలాయం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితిలో నూతన పంచాయతీ కార్యాలయాన్ని పార్లమెంట్ ఆకారంలో నిర్మించారు. గురువారం పంచాయతీ దినోత్సవం సందర్భంగా మత్తిలి బీడీఓ ప్రమోద్ కుమార్ బెహరా ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్లమెంట్‌పై అవగాహన కల్పించేందుకే ఇలా నిర్మించినట్లు తెలిపారు.

స్వగ్రామంలో ప్రశాంత్ శతపతి అంత్యక్రియలు

భువనేశ్వర్: జమ్ము కశ్మీరు పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన ప్రశాంత్ శతపతి మృతదేహం బుధవారం అర్ధరాత్రి 12.30 గంటలకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడ నుంచి గురువారం ఉదయం బాలాసోర్ జిల్లా ఇసాణి గ్రామానికి చేరుకుంది. గ్రామమంతా విషాద వాతావరణం నెలకొంది. సాధారణ ప్రజల నుంచి రాజకీయ నాయకులు, సీనియర్ పోలీసు అధికారుల వరకు అందరూ రాత్రి పొద్దుపోయే వరకు విమానాశ్రయంలో వేచి ఉన్నారు. పెహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ప్రశాంత్ శతపతి అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో గురువారం నిర్వహించారు. అంతకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, స్థానిక లోక్ సభ సభ్యుడు ప్రతాప్ చంద్ర షడంగి బాధిత కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి సంతాపం ప్రకటించారు. పుష్ప గుచ్ఛంతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబీకులకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. దివంగత ప్రశాంత శత్పతి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించారు. కుమారుని విద్యాభ్యాసం బాధ్యతల్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. వీటితో బాధిత కుటుంబీకులకు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ప్రశాంత్ మృతదేహం స్థానిక విమానాశ్రయం చేరడంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా, సీనియర్ పోలీసు అధికారులు నివాళులర్పించారు. ఆ తర్వాత మృతదేహం బాలాసోర్ జిల్లాలోని అతని స్వగ్రామం ఇసాణి గ్రామానికి తరలించారు. బాలాసోర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రశాంత్ శతపతి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని మైనరు కుమారుడు ముఖాగ్ని పెట్టి తండ్రి అంత్యక్రియలు నిర్వహించాడు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా అంత్యక్రియలకు హాజరయ్యారు.



ప్రశాంత్ శతపతి అంత్యక్రియలు నిర్వహించిన కుమారుడు



సంతాపం ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



విమానాశ్రయంలో శ్రద్ధాంజలి ఘటించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్



ప్రశాంత్ శతపతికి సంతాపం ప్రకటించిన బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్

క్లుప్తంగా

అభిప్రాయ సేకరణ



ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక ఉమాశంకర్ పీఎస్ఆర్ లైన్‌లోని రెండు విదేశీ మద్యం దుకాణాలకు తొలగించాలని ఆ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు జిల్లా యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు గురువారం జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పీఎస్ఆర్ లైన్‌లో నివాసముంటున్న ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ రెండు విదేశీ మద్యం దుకాణాల వలన మందుబాబుల ఆగడాలకు అంతులేకుండా పోతోందని, నెల రోజుల క్రితం జిల్లా కేంద్రంలో జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆ ప్రాంత మహిళలు కలెక్టర్ ఫరూల్ పట్వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన యంత్రాంగం ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల అభిప్రాయాలను సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అత్యధిక శాతం మంది ఈ మద్యం దుకాణాల వలన కలిగే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకు రావడంతో పాటు వాటిని వేరేచోటుకి స్థానాంతరం చేయాలని కోరారు. నివేదిక మేరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

కారు ఢీకొని బాలిక మృతి



మల్కన్‌గిరి ఆస్పత్రి వద్ద బాలిక మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి తమ్సాపల్లి పంచాయతీ ఎంవీ 12 గ్రామంలో గురువారం ఉదయం 11 గంటల సమయంలో కారు ఢీకొని శ్రావణి పాత్రో(8) అనే బాలిక ప్రాణాలు కోల్పోయింది. డ్రైవర్ కారు వదిలి పారిపోయాడు. బాలికను కోరుకొండ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చనిపోయినట్లు నిర్ధారించారు. కోరుకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాధు చేయగా ఐఐసీ హిమాంశు కుమార్ బారిక్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వితంతు పింఛన్లు మంజూరు

శ్రీకాకుళం పాతబస్టాండ్: 2024 జనవరి నుంచి అక్టోబర్ మధ్య వితంతువులకు పింఛన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం మెమో విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాలో 4,623 మంది వితంతువులకు గాను రూ.1,84,92,000 కోట్లు మంజూరు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

25 శాతం ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: విద్యాహక్కు చట్టం–2009 సెక్షన్12(1) సి ప్రకారం 2025–26 విద్యాసంవత్సరంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల విద్యార్థులు సమీప ప్రాంతంలోని అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త ఎస్. శశిభూషణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు 25 శాతం కోటా కింద ప్రవేశం పొందడానికి పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, పూర్తి వివరాలకు 9703585990 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు

విద్యాశాఖ అధికారులు ఏకపక్ష నిర్ణయాలు వీడాలి

శ్రీకాకుళం: రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా మౌఖిక ఆదేశాలతో ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం ఎంత వరకు సమంజసమని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ప్రశ్నించారు. గురువారం వారు మాట్లాడుతూ నిన్నటి వరకూ హైస్కూల్లో ఉన్న ప్రైమరీ తరగతుల్లో రోల్ 40 దాటితే 5 ఎస్జీటీలు ఇస్తామని, ఇప్పుడు 31 నుంచి 59 వరకు నాలుగు ఎస్జీటీలు ఇస్తామని వర్క్ షీట్ విడుదల చేయడం తగదన్నారు. యూపీ పాఠశాలపై పూర్తిగా కక్ష కట్టారని 6,7,8 తరగతిలో ఎంత మంది పిల్లలు ఉన్నా స్కూల్ అసిస్టెంట్లు మిగిలితేనే ఇస్తామని మోసకారి మాట లు చెబుతుండటం సరికాదన్నారు. యూపీ పాఠశాలలో 6, 7, 8వ తరగతులలో 31 మంది విద్యార్థులు న్నా 139 మంది విద్యార్థులున్నా నలుగురు ఎస్జీటీలనే కేటాయిస్తామనడం భావ్యం కాదన్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలను వీడాలని విజ్ఞప్తి చేశారు.

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న పలువురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులు (ఏవో)గా పదోన్నతులు కల్పిస్తూ నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం అందజేశారు. సీతంపేట మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్ ఎ.లోకేశ్వరరావుకు రాజాం మండలపరిషత్ కార్యాలయ ఏఓగా, వంగర మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ జి.సత్యనారాయణను జలుమూరు మండల పరిషత్ ఏవోగా, కోటబొమ్మాళి మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ బి.పార్వతీశంను నందిగాం మండల పరిషత్ ఏఓగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే కారుణ్య నియామకం కింద కవిటి మండలం రాజపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బంగారి శిరీషకు ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉద్యోగాన్ని కల్పిస్తూ నియామక పత్రాన్ని అందించారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

కొరాపుట్: పంచాయతీరాజ్ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సాయి కల్యాణ మండపంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ, మైనారిటీ, ప్రాథమిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులు చెక్కులు అందజేశారు. ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో నబరంగ్‌పూర్ కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తదితరులు పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉత్తమ బ్లాక్‌గా జయపూర్‌ను ప్రకటించారు. జయపూర్ బీడీఓ శక్తి మహాపాత్రోకు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో సమితి కార్యాలయ మైదానంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కర్యక్రమాన్ని జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ చంద్ర శభరో ప్రారంభించారు. సీఎం మోహన్ చరణ్ మాఝి పూరీ జిల్లాలో ముందుగా ఈ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో 6 లక్షలు మంది అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్కన్‌గిరి సమితిలో 64 మందికి, పురపాలకలోని 49 మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. జిల్లా ఉన్న 7 సమితుల్లో బలిమెలలో 16 మందికి, మత్తిలిలో 36 మందికి, కలిమెలలో 161 మందికి, ఖోయిర్‌పూట్ 25 మందికి, కోరుకొండా 58 మందికి, పోడియా 34 మందికి, చిత్రకొండ 26 మందికి రేషన్ కార్డులు అందజేశారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జిల్లా అధికార యంత్రాంగం గజపతి స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. డీఆర్‌డీఏ. ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, అదనపు అధికారి పృథ్వీరాజ్ మండల్, పురపాలక ఈఓ లక్ష్మణ ముర్మ, బ్లాక్ ఫైనాన్స్ అధికారి గజేంద్ర బెహరా, ఈఓ జిల్లా పంచాయతీ అధికారి అశోక్‌కుమార్ పట్నాయక్, గుమ్మా జెడ్పీటీసీ రేణుకా పాత్రో తదితరులు విచ్చేశారు. కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో మరణించిన 26 మంది ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ కలిసి పని చేస్తే పంచాయతీ, గ్రామ స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. 234 మందికి కొత్త రేషన్ కార్డులను అందజేశారు. సామాజిక సురక్షా, అంగవికలాంగులు నలుగురికి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పీఎం ఆవాస్ యోజనా పథకం కింద మూడు గ్రామ పంచాయతీలకు రివార్డులను అందజేశారు. జిల్లా పరిషత్తు అసిస్టెంట ఇంజినీర్ వెంకటరావు ఆచారి, ఓ.ఎల్.ఎం.డి.పి.ఎం టిమోన్ బోరా, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, తదితరులు పాల్గొన్నారు.



-కొరాపుట్: ఉత్తమ సమితి అవార్డుతో జయపూర్ బీడీఓ శక్తి మహాపాత్రో



కొరాపుట్: వేడుకల్లో పాల్గొన్న మంత్రి నిత్యానంద గొండో, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో



కొత్త రేషన్ కార్డులను అందజేస్తున్న అధికారులు



అభివృద్ధి పనులకు చెక్కును అందజేస్తున్న అధికారులు



పర్లాకిమిడి: పంచాయతీ రాజ్ సభకు విచ్చేసిన మహిళలు



పర్లాకిమిడి: లబ్ధిదారునికి రేషన్ కార్డు అందజేస్తున్న కలెక్టర్

ప్రేమ్ పహాడ్ వద్ద కుందేళ్ల కళేబరాలు



ప్రేమ్ పహాడ్ వద్ద పడి ఉన్న కుందేళ్ల మృతదేహాలు

రాయగడ: స్థానిక చెక్కాగుడ సమీపంలో గల ప్రేమ్ పహాడ్ వద్ద 5 కుందేళ్ల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకే చోట కుందేళ్ల మృతదేహాలు పడి ఉండటం పై పలువురు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు ప్రేమ్ పహాడ్ వద్దకు వచ్చి వాకింగ్, జాగింగ్ వంటి వ్యాయామాలు చేస్తుంటారు. అయితే ఇంత వరకు ఈ ప్రాంతంలో ఒక్క కుందేలును కూడా తాము చూడలేదని వాకర్స్ క్లబ్ సభ్యులు శంకర్షన్ మంగరాజ్ చెప్పారు. ఇదే విషయమై ఫారెస్ట్ రేంజర్ కామేశ్వర్ ఆచారి దృష్టికి తీసుకువెళ్లగా ప్రేమ్ పహాడ్ వద్ద కుందేళ్ల సంచారం చేసే విషయం ఎప్పుడూ తమ దృష్టికి రాలేదని అన్నారు. అయితే ఒకే ప్రాంతంలో కుందేళ్ల మృతదేహాలు పడి ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై దర్యాప్తు ప్రారంభిస్తామని అన్నారు

నలుగురు దొంగల అరెస్టు



దొంగతనాలపై వివరిస్తున్న ఎస్‌డిపిఓ పార్థ జగదీష్ కశ్యప్



పట్టుబడిన నగదు



నిందితుల నుంచి పోలీసులు సీజ్ చేసిన బంగారు గొలుసులు

జయపురం: పలు దొంగతనాల్లో నిందితులైన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయపురం సబ్‌డివిజనల్ పోలీసు అధికారి పార్థజగదీష్ కాశ్యప్ గురువారం తెలిపారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ సభాగృహంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుల నుంచి నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారిపై జయపురం పట్టణ, సదర్ పోలీసు స్టేషన్‌లలో మూడు కేసులు మల్కన్‌గిరి, మత్తిలి, బొయిపరిగుడ, బొరిగుమ్మ, కొరాపుట్ దమంజొడి మొదలగు పోలీసు స్టేషన్లలో 10 కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

ఉగ్రదాడి అమానుషం



పర్లాకిమిడి: ప్యాలస్ వద్ద నినాదాలు చేస్తున్న భజరంగ్‌దళ్ ప్రతినిధులు

జయపురం: కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం జయపురం రథోపాడియలో హిందూ సమాజ్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. హిందూ సమాజ్ నేత బాబూ భగరంగదల్ మాట్లాడుతూ హిందువులపై జరిగిన దాడులను తీవ్రంగా పరిగణించాలన్నారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హిందూ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

బొయిపరిగుడలో..

జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడలో సహిద్ లక్ష్మణ నాయక్ జంక్షన్‌లో బొయిపరిగుడ గ్రామ ప్రజలు గురువారం రాత్రి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుల్లో ఒడిశా రాష్ట్ర బాలేశ్వర జిల్లాకు చెందిన ప్రశాంత కుమార్ శతపతి ఒకరని వెల్లడించారు. ఈ సంతాప సభలో సమితి ఉపాధ్యక్షులు పూర్ణిమ బారిక్, సర్పంచ్ సూర్యమణి నాయక్, జిల్లా పరిషత్ సభ్యులు రిజేష్ మహురియ, సమితి సభ్యులు మంజులత పట్నాయక్, మాజీ సర్పంచ్ భగీరత్ ముర్జియ, ఫ్రండ్స్ యూనిట్ క్లబ్ సభ్యులు పాల్గొని మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: కాశ్మీర్‌లో రెండు రోజుల క్రితం టెర్రరిస్టుల దాడి అత్యంత హేయమైనదని, పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలని నినాదాలు చేస్తూ భజరంగదళ్, వీహెచ్‌పీ ప్రతినిధులు పర్లాకిమిడి రాజా ప్యాలస్ వద్ద నిరసన తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు.



జయపురం: బొయిపరిగుడలో మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రజలు



జయపురం: హిందూ సమాజ్ నిర్వహించిన సభలో మాట్లాడుతున్న బాబూ భజరంగబల్

పల్లెనిద్రలో ఎమ్మెల్యేను నిలదీసిన మహిళ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : బూర్జ గ్రామంలో ఈ నెల 21న జరిగిన పల్లె నిద్ర కార్యక్రమానికి హాజరైన ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌కు బొమ్మాళి రేవతి అనే మహిళ సమస్యలపై నిలదీసింది. ఉపాధి పనులు చేపట్టినప్పుడు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని, సకాలంలో బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. పార్టీలకతీతంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నారు.

పాలిసెట్ హాల్‌టికెట్లు సిద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ పాలిసెట్ – 2025కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ బి.జానకిరామయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీవోఎల్‌వైసీఈటీఏపీ.ఎస్‌బీటీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల ని సూచించారు. ఈ నెల 30న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

కూర్మనాథాలయ ఈఓగా నరసింహనాయుడు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథాలయ ఈవోగా కె.నరసింహ నాయుడు గురువా రం బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల గా శ్రీకూర్మంతో పా టు రావివలస, పలా స గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌కు ఇన్‌చార్జి ఈవోగా గురునాథరావు వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల తాబేళ్ల దహనం ఘటన చోటుచేసుకోవడంతో దేవదాయశాఖ ఎట్టకేలకు రెగ్యులర్ ఈఓ నియామకం చేపట్టింది. ఈ సందర్భంగా నరసింహనాయుడు తాబేళ్ల పార్కు, ఆలయ క్యూలైన్లు, నిత్యాన్నదాన సత్రాలను పరిశీలించారు.

10, 11వ తేదీల్లో సాహితీ సంబరాలు



సాహితీ సంబరాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏలూరులో శ్రీ శ్రీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో మే 10, 11వ తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు సంబంధించి స్వగత పత్రాలను గురువారం శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ ఆవిష్కరించారు. సంబరాల్లో పాల్గొంటున్న వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, ప్రొఫెసర్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, సంక్షేమ డీన్ రవి, తెలుగు బోధకులు పెద్దింటి ముకుందరావు, పి.చిరంజీవిరావు, రాకోటి శ్రీనివాసరావు, కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు వేమన, రచయిత జంధ్యాల శరత్‌బాబు పాల్గొన్నారు.

సీఎం భద్రతా ఏర్పాట్ల సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 26న ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు సమీక్ష నిర్వహించారు. అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్‌పై సీఎం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అడిషనల్ ఎస్పీ ఎ.వి.రమణతో చర్చించారు. హెలిప్యాడ్, డయాస్, సభ నిర్వహణపై సమీక్షించారు. పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పర్లాకిమిడి: పాటికోట గ్రామానికి చెందిన శాసనం ఫాల్గుణ రావు (48) గురువారం ఉదయం గంజాం జిల్లా గోలంతర వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన పర్లాకిమిడి నుంచి భువనేశ్వర్‌కు సెంచూరియన్ వర్సిటీ పనిమీద వెళుతుండగా హైవే వద్ద కారుకు పెట్రోలు కొట్టించుకుని ఫోనులో మాట్లాడుతూ రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయనకు బలమైన గాయాలు కావడంతో దగ్గరలో ఉన్న బరంపురం ఎం.కె.సి.జీ మెడికల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు ఐదుగురు అన్నదమ్ములు, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఫాల్గుణ రావు మరణంతో పాటికోట గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. ఆయన సెంచూరియన్ వర్సిటీ జనరల్ మేనేజర్ (అడ్మిషన్) విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన మృతికి సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.



బరంపురం మెడికల్‌లో చికిత్సపొందుతూ మృతి చెందిన శాసనం ఫల్గుణరావు



ఫల్గుణరావు (ఫైల్)

వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలి



నగరంలో ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వక్ఫ్ సవరణ చట్టం–2025కు వ్యతిరేకంగా గురువారం జిల్లా ముస్లింల ఐక్య సమాఖ్య జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా కాశ్మీర్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు నివాళులు అర్పించారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం ఏడు రోడ్ల కూడలిలో బయలుదేరి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు జిల్లా ముస్లిం ఐక్య సమాఖ్య జేఏసీ నాయకులు శ్రీనివాసరావు, సలీం, హాజీ అమీరుల్లా బేగ్, రఫీ, మహీబుల్లా ఖాన్, ముజీబ్, అక్బర్‌బా షా, మహిళా సోదరీమణులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త చట్టం ముస్లింల హక్కులను కాలరాస్తుందన్నా రు. భవిష్యత్తులో ముస్లింల మనుగడకే ఇబ్బందిగా మారే చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ముస్లింల ర్యాలీకి అన్ని రాజకీయా పక్షాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, సీఐటీయూసీ, ఏఐటీయూసీ నాయకులు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంగరాజు

కంచిలి: కంచిలిలో 12 కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోంపేట సీఐ బి. మంగరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం కంచిలి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సోంపేట రైల్వేస్టేషన్ క్వార్టర్స్ వద్ద ఆటోలో ఓ వ్యక్తి గంజాయితో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. గంజాం జిల్లా ఎంద్రిమ గ్రామానికి చెందిన అనిల్‌నాయక్ వద్ద 12 కిలోల గంజాయితో బ్యాగ్ దొరికింది. వెంటనే యువకుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు కేజీల గంజాయితో..

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో గురువారం ముగ్గురు యువకులను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. రెండు బ్యాగులలో 6.38 కేజీల గంజాయి, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

అగ్నికి ఆహుతైన ఎర్రచందనం చెట్లు



ఎర్రచందనం తోటలో అగ్నిప్రమాదం



బాధితుడు సత్యరాజ్‌కు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి: కోటబొమ్మాళి మండలం శ్రీజగన్నాథపురం పంచాయతీ బిర్లంగిపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నూక సత్యరాజ్‌కు చెందిన సుమారు 2 ఎకరాల ఎర్ర చందనం తోటలో గురువారం రాత్రి అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, కోటబొమ్మాళి మండల కన్వీనర్ సంపతిరావు హేమసుందర్‌రాజు, జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు పేడాడ వెంకటరావు, సత్తారు సత్యం తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు సత్యరాజ్‌కు అండగా నిలిచారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే ఇలా వికృత చేష్టలకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై పూర్తి దర్యాప్తు చేసి బాధితుడికి న్యాయం చేయాలని నాయకులు కోరారు.

క్లుప్తంగా

ఎస్టీ నకిలీ సర్టిఫికెట్ల వ్యవస్థను అరికట్టాలి

- కమిషన్ చైర్మన్‌కు ఆదివాసీ జేఏసీ వినతి



వినతిపత్రాన్ని అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్రలో ఉన్న నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల వ్యవస్థను అరికట్టాలని ఆదివాసీ జాయింట్ ఏక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సభ్యులు గురువారం ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును ఆయన కాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. షెడ్యూల్ ప్రాంత భూములపై హక్కులు గిరిజనులకే దక్కేలా చూడాలని, ఇతర దీర్ఘ కాల సమస్యలపై ప్రభుత్వ స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ఎస్టీల అభ్యున్నతికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు నిమ్మక జయరాజు, ఆరిక నీలకంఠం, అమర్నాథ్ తదితరులు ఉన్నారు.

మద్యం విక్రయదారు అరెస్ట్

మెరకముడిదాం: మండలంలోని ఎం.రావివలస గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వుణ్నా కిరణ్‌కుమార్ అనే వ్యక్తిని బుదరాయవలస ఎస్సై జె.లోకేష్‌కుమార్ అరెస్ట్ చేశారు. గురువారం సాయంత్రం పక్కా సమాచారంతో ఎస్సై జె.లోకేష్‌కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి ఎం.రావివలస గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వుణ్నా కిరణ్‌కుమార్ ఇంటిపై దాడులు నిర్వహించగా ఇంట్లో 10 మద్యం బాటిల్స్ దొరకడంతో స్వాధీనం చేసుకున్నారు. కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఓ మురళీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీడబ్ల్యూ ఆర్‌జేసీ పి.కోనవలస, కురుపాం, భద్రగిరి, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలికలు), భద్రగిరిలో ఎంపీసీ–40, బైపీసీ–40, హెచ్‌ఈసీ–40 సీట్లు చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మే 7వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్:టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ సెట్.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సమీపంలో గల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

పత్తి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని వైకేఎం కాలనీకి చెందిన ఓ వ్యక్తి పత్తి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైకేఎం కాలనీకి చెందిన వెలగాల శ్రీనివాసరెడ్డి అప్పులు చేసి ఎప్పటికప్పుడు తాగుతుండడంతో భార్య సావిత్రి మందలిస్తూ ఉండేది. బుధవారం రాత్రి కూడా తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెంది గురువారం తెల్లవారు జామున పత్తి మందు తాగేశాడు. కొత్తసమయం తరువాత వాంతులు చేసుకోవడంతో పత్తిమందు వాసన రాగా భార్య సావిత్రి గమనించి 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకొ రావడంతో వైద్యులు చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం స్థానిక కర్షక మహర్షి ఆస్పత్రికి తరలించారు.

నేడు ఏపీఆర్‌జేసీ గురుకుల ప్రవేశ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ శ్రీనివాస్‌మూర్తి

విజయనగరం అర్బన్: ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్ ఈఐ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రవేశ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ శ్రీనివాస్ మూర్తి తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ అధికారులతో గురువారం ఆయన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీఆర్‌ఈఐ గురుకులాల్లో 5, 6, 7, 8 తరగతుల లో ప్రవేశం కోసం ఈ నెల 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జిల్లాలోని 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష కోసం 1,287 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీల్లో ప్రవేశం కోసం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 10 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీఆర్‌జేసీ కోసం 10 కేంద్రాల్లో 2104 మంది అభ్యర్థులు, ఏపీఆర్‌డీసీ కోసం 77 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారన్నారు. సమావేశంలో డీఈఓ యూ.మాణిక్యం నాయుడు, పరీక్షల సహాయ కమిషనర్ టి.సన్యాసిరాజు, ఏపీఆర్‌ఐఈ జిల్లా కోఆర్డినేటర్ శంబాన రూపవతి పాల్గొన్నారు.

ఆటోవాలా డీలా..!

- ప్రైవేట్ సంస్థ చేతుల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు
- సర్టిఫికెట్ లేకపోతే రూ.10వేలు జరిమానా
- గుదిబండగా మారిన ఫిట్‌నెస్ టెస్ట్
- బ్రోకర్ల హవాతో రూ.3వేలకు సర్టిఫికెట్ మంజూరు

విజయనగరం టౌన్: చాలీచాలని డబ్బులతో, నిత్యం పోలీసుల వేధింపులతో అపరాధరుసుం కట్టలేక.. నానాయాతన పడుతూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్న ఆటోడ్రైవర్లకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వం ఏకంగా వారి నడ్డి విరిచేసింది. అప్పులఊబిలో కూరుకుపోయే పరిస్థితికి తీసుకువచ్చింది. ప్రభుత్వం ఆధీనంలో ఉండే అప్రూవ్ ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్(ఏటీఎస్)ను ఏకంగా ప్రైవేట్ సంస్థకు అప్పగించి, ఆర్‌టీఓ కార్యాలయానికి ఎటువంటి సంబంధం లేకుండా చేసింది. దీనిప్రభావంతో రాబోయేరోజుల్లో పైసలిచ్చే వాడికి సర్టిఫికెట్లు విరివిగా వస్తాయనడంలో సందేహం లేదు. బ్రోకర్ల హవా ఇప్పటికే పెరిగిపోయింది. పాఠశాలలు, కళాశాలల వాహనాలతో పాటు, ఆటో, క్యాబ్ ఇలా అన్నింటికి సర్టిఫికెట్లను మెషీన్ ద్వారా ఇచ్చేసి, నడ్డివిరగొట్టారని ఆటోడ్రైవర్లు ఆవేదన వెళ్లగక్కుతున్నారు.

ఏటీఎస్‌ను రద్దు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటీఎస్ పేరుతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (బ్రేక్) జారీచేసే విధానాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల ఆటోలు, లారీలు, ట్రాక్టర్‌లు, జీపులు, బస్సులు, మినీవ్యాన్‌ల యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టెక్నికల్ స్టాఫ్ లేకుండా జరిగే పరిణామాలకు ప్రభుత్వపరంగా ఉంటే అధికారులపై చర్యలు తీసుకోవచ్చని, ఇలా అయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఏటీఎస్ ద్వారా ప్రవేశపెట్టిన కొన్ని రాష్ట్రాలలో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్,



ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోయూనియన్ నాయకులు (ఫైల్)

ఉత్తరాఖండ్, గుజరాత్‌లతో పాటు 16 రాష్ట్రాలలో ఏటీఎస్ సెంటర్‌లను రద్దుచేసిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకుని మన రాష్ట్రంలో కూడా ఏటీఎస్‌లను రద్దుచేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 18వేలకు పైగా ఆటోలు నిత్యం తిరుగుతుంటాయి. వాటికి గతంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఫిట్‌నెస్ కేంద్రంలో అధికారులు పరిశీలించి సర్టిఫికెట్ జారీచేసేవారు. అందుకు గాను డ్రైవర్లు రూ.860 చలానా కట్టేవారు. కేవలం ఒక్కసారి మాత్రమే చలానా కట్టించుకునేవారు. టెస్ట్‌లో ఫెయిలైతే మళ్లీ కట్టాల్సిన పని ఉండేది కాదు. ప్రైవేట్ ఏటీఎస్‌లో నెలరోజుల్లోనే రూ.200 పెంచి రూ.1060 కట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకసారి అన్‌ఫిట్ అయితే మళ్లీ రూ.1060 కట్టాల్సిందే. ఇక్కడే దళారీ వ్యవస్థ బాగా అభివృద్ధిలోకి వచ్చింది. వారికి రూ.2440 నుంచి రూ.4వేల వరకూ చెల్లిస్తే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వచ్చేస్తుంది. లేదంటే వాహనం ఎంత కండిషన్‌లో ఉన్నప్పటికీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రాదు. టెస్ట్ చేసే సమయంలో డ్రైవర్‌ను లోపలికి అనుమతించరు. దీంతో తమ వాహనానికి ఫిట్‌నెస్ ఎందుకు అవలేదో వారికి అర్థం కాని పరిస్థితి.

వాహనమిత్ర పేరుతో గతంలో సాయం

గత వైఎస్‌సీపీ ప్రభుత్వం వాహనమిత్ర పేరిట ఏటా రూ.10వేలు చొప్పున జిల్లాలోని వేలాదిమంది ఆటో కార్మికులకు అందజేసింది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రెండేళ్లపాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా పేదలైన డ్రైవర్లను ఆదుకునేందుకు నాటి ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించింది. ఏడాదికి ఒకసారి ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితర పనులకు వాహనమిత్ర నగదు ఉపయోగపడేది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పథకాల మాట పక్కనపెడితే ఏకంగా డ్రైవర్లపై కక్ష గట్టినట్లు వ్యవహరిస్తోంది. దీంతో వేలాదిమంది ఆటో కార్మికులు లబోదిబోమంటున్నారు.



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం (ఫైల్)

ఆర్థికసాయంతో నాడు ఆదుకున్నారు



వాహనమిత్ర రూ.10వేలు లబ్ధిపొందాను. నాడు వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సాయమందించి ఆదుకుంది. నేడు టీడీపీ ప్రభుత్వం పథకాలను తుంగలో తొక్కేసింది. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాలను ఏర్పాటుచేసి ముంచేస్తున్నారు.

–ఉరిటి రామచంద్రరావు, డ్రైవర్

కుటుంబాన్ని పోషించడమే కష్టంగా ఉంది



ప్రతిరోజూ డ్రైవర్లకు వేధింపుల పర్వం ఎక్కువైంది. ఓ వైపు పోలీసులు అపరాధరుసుం అంటూ ఫైన్ వేస్తున్నారు. మరోవైపు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే ఏకంగా రూ.10వేలు ఫైన్ పడిపోతోంది. సర్టిఫికెట్ చేయించుకుందామంటే వేలకు వేలు ఇవ్వాల్సిన పరిస్థితి. ఎందుకు ఫెయిల్ చేశారో కూడా తెలియక , ఏమీ చేయలేని గందరగోళ స్థితిలో ఉన్నాం .

మామిడి అప్పన్న, డ్రైవర్

ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తీవ్రం



పూర్తిగా ఫెయిలైన ప్రైవేట్ ఏటీఎస్ కేంద్రాన్ని రాష్ట్రప్రభుత్వం తక్షణమే తొలగించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. రాష్ట్రంలో ఇలాంటి వాటిని తీసుకువచ్చి కూటమి ప్రభుత్వం డ్రైవర్ల నడ్డి విరగ్గొట్టడం ఎంతవరకూ సబబు. కుట్రపూరిత ఆలోచనలను వెంటనే తరిమికొట్టాలని కోరుతున్నాం . లేకుంటే ఆందోళన తప్పదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

రెడ్డి నారాయణరావు,
శ్రీ విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్, ఏఐఎఫ్‌టీయూ

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- స్కూటీని ఢీకొట్టిన వ్యాన్



శ్రీదేవి మృతదేహం

సీతానగరం: మండలంలోని జాతీయరహదారిలో లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం స్కూటీని వెనుక నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.బొబ్బిలి పట్టణానికి చెందిన పట్నాయకుని అనిల్‌కుమార్, భార్య శ్రీదేవి స్కూటీపై సీతానగరంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ముడుపుల పూజకు వస్తున్నారు. లచ్చయ్యపేట వచ్చే సమయానికి వెనుకనుంచి వస్తున్న బొలెరో వాహనం స్కూటీని బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలిద్దరూ రోడ్డుపై పడిపోవడంతో శ్రీదేవి తలకు బలమైన గాయం కాగా ఇద్దరినీ 108 వాహనంలో చికిత్స నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీదేవి మృతి చెందింది. ఈ మేరకు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

బైక్‌ను ఢీ కొట్టిన బొలెరో: వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన కిరణ్‌కుమార్

మండలంలోని జాతీయరహదారిపై లచ్చయ్యపేట– కింతలివానిపేట గ్రామాల మధ్య ఉన్న హనుమాన్ గుడివద్ద మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలికి చెందిన ఆదిమూలం కిరణ్‌కుమార్ బొబ్బిలి నుంచి పార్వతీపురం బైక్‌పై వస్తున్న సమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై వస్తున్న కిరణ్ కుమార్ రోడ్డుపై పడిపోగా బలమైన గాయాలయ్యాయి. దీంతో బాధితుడిని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. క్షతగాత్రుడి తండ్రి కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

చెట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రామస్వామి మృతదేహం


చీపురుపల్లి రూరల్: గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కోరాడ రామస్వామి(51) అనే వ్యక్తి కొబ్బరిచెట్టు నుంచి కిందికి పడి మృతిచెందాడు.ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల మేరకు రామస్వామి కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ కొబ్బరి బొండాల కోసం చెట్లు ఎక్కి తీసుకువచ్చి వ్యాపారం చేస్తుంటాడు. ఎప్పటిలాగానే గురువారం ఉదయం కూడా చీపురుపల్లి మండలంలోని ఆర్థివలస గ్రామంలో కొబ్బరి బొండాల కోసం చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో బొండాలు తీస్తుండగా కత్తి కాలుకు తగలడంతో చెట్టు నుంచి కిందికి జారి పడిపోయాడు. గాయాలతో ఉన్న రామస్వామిని హాస్పటల్‌కు తీసుకువెళ్లేందకు సమయాత్తమవుతుండగా మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడు..

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బొబ్బిలి పట్టణంలోని సంగవీధికి చెందిన పిట్ట రమేష్ (30) ప్రయాణిస్తున్న బైక్ ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చింది. దీంతో రాజాం నుంచి వస్తున్న బైక్‌ను అదుపుచేసుకోలేక ఢీకొనడంతో రమేష్ రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయాలైన రమేష్‌ను స్థానికుల సహాయంతో రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందదించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇదిలా ఉండగా మరో వాహనదారుడికి కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి సీఐ అశోక్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ఇంతవరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మలేరియా పట్ల అప్రమత్తం

- గతంలో గిరిజన ప్రాంతంలో ఎక్కువగా వ్యాధి వ్యాప్తి
- ప్రస్తుతం మైదాన ప్రాంతంలోనూ అధికంగా కేసుల నమోదు
- సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణాల మీదికి
- నేడు ప్రపంచ మలేరియా నివారణ దినం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మలేరియా నిర్ధారణ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



మలేరియా కలగజేసే అనాఫిలిస్ దోమ

విజయనగరం ఫోర్ట్: మలేరియా పేరు వినగానే మన్యప్రాంత ప్రజలు వణికిపోతారు. మలేరియా బారిన పడి ఎంతోమంది ఇబ్బంది పడేవారు. మరికొంత మంది వ్యాధితో పోరాటం చేయ లేక మృత్యువాత పడేవారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతంతో పాటు మైదాన ప్రాంతంలోనూ మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. జిల్లాలో మలేరియా కేసులు కొంతకాలంగా పెరుగుతున్నాయి. మలేరియా వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు మీదికి వచ్చే ప్రమాదం ఉంది.

అనాఫిలిస్ దోమ కుట్టడంతో వ్యాధి వ్యాప్తి

మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే ఏకకణ పరాన్నజీవి వల్ల వస్తుంది. ఈ పరాన్న జీవులు ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల మనిషి నుంచి మరో మనిషికి వ్యాపిస్తుంది. మలేరియా వచ్చినతర్వాత చికిత్స పొందేకంటే దోమతెరలు వాడి దోమ కాటును నివారించి, మలేరియా రాకుండా చేసుకోవడం ఉత్తమం.

మలేరియాలో రెండు రకాలు

మలేరియా వ్యాధిలో రెండు రకాలు ఉన్నాయి. అవి వైవాక్స్ మలేరియా, పాల్సి ఫారమ్ మలేరియా.

వ్యాధి లక్షణాలు:

తీవ్రమైన చలి జ్వరం, రోజువిడిచి రోజు జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, మలేరియా లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి.

ఏడాదికి 800 నుంచి 1000 వరకు కేసులు

మలేరియా కేసులు ఏడాదికి 800 నుంచి 1000 వరకు నమోదవుతున్నాయి. 2023–24లో 439 మలేరియా కేసులు నమోదయ్యాయి. 2024–25లో 805 కేసులు నమోదయ్యాయి. 2025 –26లో ఇప్పటివరకు 157 కేసులు నమోదయ్యాయి.

నివారణ చర్యలు

మలేరియా సోకిన పిల్లలు, గర్భిణులకు చికిత్స చేయించడంలో జాప్యం చేయకూడదు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకమవుతుంది. మలేరియా వ్యాధి నిర్ధారణ అయిన గర్భిణులు 3 వనెల నుంచి ప్రసవించే వరకు వారానికి రెండు క్లోరోక్విన్ మాత్రలు వాడడం ద్వారా మలేరియా వ్యాధిని నివారించవచ్చు.

- సింథటిక్ పైరిడ్రాయిడ్ క్రిమిసంహారక మందును ఇంటి లోపల అన్ని గదులలోను పైకప్పు లోపలి భాగంలో పిచికారీ చేసి తుడవడం గాని, గోడలను అలకడం గాని చేయకుండా చూడాలి
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- సాయంత్రం వేళ వేపాకు పొగ రూపంలో దోమలను పారదోలవచ్చు
- జ్వరం వచ్చిన వారందరూ ఉచితంగా రక్త పరీక్ష చేయించుకుని ఒక రోజు క్లోరోక్విన్ మాత్రలు వేసుకోవాలి
- నీరు నిల్వ ఉండే గోలాలు, ఎయిర్ కూలర్లు, వారానికి ఒకసారి ఖాళీ చేసి బాగా తడి ఆరిన పిమ్మటనే మళ్లీ నీరు పెట్టాలి. వీధి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేలా చూడాలి
- బావుల్లోను, పూడ్చ లేని కందకాలలోను దోమ లార్వాలను తినే గంబూషియా చేపపిల్లలను విడిచిపెట్టి దోమలు పెరగకుండా చేయవచ్చు. ప్రతి ఇంట్లోను దోమల మందు పిచికారీ చేయించుకోవాలి. దోమతెరలు వాడితే మంచిది.

మలేరియా నివారణకు చర్యలు

మలేరియా నివారణకు అన్ని చర్యలు చేపడుతున్నాం. మలేరియా నివారణలో భాగంగా దోమలను నివారించేందుకు ఏడాదికి రెండుసార్లు స్ప్రేయింగ్ చేపడుతున్నాం. సచివాలయం సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంల వద్ద కూడా మలేరియా టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి. వారు గ్రామస్థాయిలోనే మలేరియా నిర్ధారణ పరీక్షలు చేస్తారు.

దాక్టర్ జీవనరాణి,
డీఎంహెచ్‌ఓ

దూరం పెట్టిందని గొంతు కోశాడు



- పైడిభీమవరం హత్య కేసు ఛేదన
- నిందితుడు వీర్రాజు అరెస్టు
- నాలుగు నెలలుగా హతురాలితో పరిచయం
- బెట్టింగులకు అలవాటు పడి భవిష్యత్ నాశనం

చదివిన ప్రతి తరగతిలోనూ అత్యధిక మార్కులతో పాసైన ఓ కుర్రాడు బెట్టింగ్ అలవాటు మానుకోలేక చదువుకు దూరమై హోటల్‌లో సర్వర్‌గా మారి ఆఖరుకు హంతకుడిగా మిగిలాడు. చెడు సాంగత్యాన్ని మొదటిలోనే తుంచలేక ఓ వివాహిత తన ఆయుష్షును తనే తగ్గించుకుని బంగారం లాంటి బతుకును బుగ్గిపాలు చేసుకుంది. పైడి భీమవరం నడిబొడ్డున జరిగిన యువతి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేసు వివరాలు తెలిసే కొద్దీ ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

రణస్థలం: పైడిభీమవరంలో ఊరి నడిబొడ్డున ఈ నెల 19న జరిగిన అవాల భవాని హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని జేఆర్ పురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎం. అవతారం గురువారం వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

అవాల భవాని పైడిభీమవరంలోని ఓ హోటల్‌లో పనిచేసేది. అక్కడే సర్వర్‌గా పనిచేస్తున్న కొండక వీర్రాజు అనే వ్యక్తితో నాలుగు నెలల కిందట ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం హోటల్ యజమానికి తెలియడంతో వీర్రాజును పనిలో నుంచి మాన్పించేశారు. ఆ తర్వాత భవాని ఈ విషయం తమ ఇంటిలో తెలిసిపోతుందని వీర్రాజును దూరం పెట్టింది. ఫోన్ చేసినా మాట్లాడకపోవడంతో వీర్రాజు ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. మరొకరితో వివాహేతర సంబంధం ఉండడం వల్లనే తనను దూరం పెడుతోందని భావించి ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ నెల 19న పైడిభీమవరంలోని ఒక దుకాణంలో చాకు కొనుక్కుని తన దగ్గర ఉంచుకున్నాడు. పైడిభీమవరం నడిబొడ్డున ఉన్న గుర్రమ్మ గుడి వెనుక ఉన్న కాజావారి కోనేరుగట్టు వద్దకు అవాల భవాని రావడం గమనించి ఆమెను పిలిచి కొంత సమయం గొడవ పడ్డాడు. అయితే ఆమె అతడితో మాట్లాడేందుకు నిరాకరించింది. దీంతో తనతో తెచ్చుకున్న చాకుతో భవాని గొంతును రెండు సార్లు బలంగా కోసినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత అక్కడ నుంచి పారిపోయిన వీర్రాజు విజయవాడలోని ఇంటికి చేరుకుని ఎవరూ గుర్తు పట్టకుండా గుండు గీసుకుని తిరుపతి వెళ్లిపోయాడు. తిరిగి వస్తుండగా పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు రణస్థలం మండలంలోని కమ్మసిగడాం వద్ద అదుపులోకి తీసుకున్నారు. కేసును త్వరగా ఛేదించిన జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి, సిబ్బంది పి.హేమంత్ కుమార్, కేకే సింగ్, సీహెచ్ సురేష్‌ను జిల్లా ఉన్నతాధికారులు ప్రశంసించారు.



పైడిభీమవరం హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న జేఆర్ పురం సీఐ అవతారం, పక్కన ఎస్ఐ చిరంజీవి

అన్నింటిలోనూ టాపరే..

ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు కొండక వీర్రాజు స్వగ్రామం విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో గల నడిపల్లి గ్రామం. కుటుంబ సభ్యులతో చిన్నతనం నుంచి విజయవాడ వలస వెళ్లి అక్కడే ఉండేవాడు. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు అక్కడే చదువుకున్నాడు. పదిలో పదికి పది, ఇంటర్‌లో 965 మార్కులు, డిగ్రీ రెండేళ్లలోనూ 90శాతం మార్కులు సాధించాడు. డిగ్రీ చివరి ఏడాదిలో బెట్టింగులకు అలవాటు పడి డబ్బులు అప్పు చేసి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో అన్నదమ్ములు నాలుగు నెలలు క్రితం స్వగ్రా మం నడిపిల్లి పంపించేశారు. తదుపరి నడిపిల్లి వచ్చిన అతను పైడిభీమవరంలోని ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిలో జాయినయ్యాడు. అంత తెలివైన విద్యార్థి బెట్టింగ్ మానుకోలేక ఆఖరుకు హంతకుడిగా మిగిలాడు.

కౌమార దశ పిల్లలకు సన్మార్గం చూపాలి

- సెల్‌ఫోన్‌లకు పిల్లలను దూరం చేయాలి
- స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి

విజయనగరం ఫోర్ట్: కౌమారదశ పిల్లల్లో మానసిక, శారీరక ఆలోచనలు విభిన్నంగా ఉంటాయని, తల్లిదండ్రులు, సంరక్షకులు వారితో మేమేకమై సన్మార్గం చూపాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి పిలుపునిచ్చారు. స్థానిక కన్వెన్షన్ సెంటర్‌లో సీడీపీఓలకు గురువారం నిర్వహించిన వర్క్‌షాపును ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల ఆలోచనలు ప్రమాదకర పరిస్థితుల నుంచి దూరం చేయాలన్నారు. బాల, బాలికలను డిజిటల్ మాధ్యమాలు ప్రభావితం చేస్తున్నాయని, కౌమారదశలో ఉన్న బాలబాలికలతో చర్చించి వారి అవసరాలు తీర్చాలని తెలి పారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని, లేదంటే డిజిటల్ మాధ్యమాల ప్రభావంతో చెడుదారిన పడే ప్రమాదం ఉందన్నారు. గత 7, 8 సంవత్సరాలుగా జరుగుతున్న అధ్యయనాల్లో కౌమారదశలో ఉన్న పిల్లలు మద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడుతున్నట్లు తేలిందన్నారు. జిల్లాలో ఉన్న సఖి, యువ గ్రూప్ పరిధిలో కిశోర బాలబాలికలు, వారి తల్లిదండ్రులకు పోక్సో చట్టం గురించి వివరించాలని చెప్పారు. బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ నిరోధించాలన్నారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో వివిధ వృత్తివిద్యాకోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు.